

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.93	1,610.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	48,221	84
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	48,314	9,775
నీటి నిల్వ (టీఎంసీలు)	101.50	37.78



జాలిహళ్లి వద్ద పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

అదుపుతప్పిన కేఎస్ ఆర్టీసీ బస్సు

బళ్లారిరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మోకా సమీపంలో గల జాలిహాళ్ గ్రామానికి చెందిన కేఎస్ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పడిపోయింది. శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో దాదాపు 68 మంది ప్రయాణికులతో వెళుతున్న బస్సు స్టీరింగ్ రాడ్డు పని చేయకపోవడంతో ఓ మలుపు వద్ద వరి పొలంలోకి బస్సుకు దూసుకుని వెళ్లి ఒరిగిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులు, విద్యార్థులు బెంబేలెత్తిపోయి బస్సు కిటికీల కిందకు దూకారు. ఎవ్వరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గ్రామీణ ప్రాంతాలకు కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని, గత 15 రోజుల క్రితం మోకా సమీపంలో మరో బస్సు ప్రమాదానికి గురయ్యిందని, మరోసారి ఇలా జరగడం బాధాకరమని ప్రయాణికులు కోరుతున్నారు.



కిటికీల్లోంచి దూకుతున్న విద్యార్థులు

జూదరుల అరెస్ట్

బళ్లారి సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పోలీస్ పరిధిలోని సంగనకల్లు గ్రామ దగ్గర ఉన్న ఫాంహౌస్‌లో శుక్రవారం జూదం ఆడుతున్న 19మందిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి నగదును స్వాధీనం చేసున్నారు. ఫాంహౌస్‌లో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. తెల్లవారుజామున 1-30గంటల ప్రాంతంలో దాడిచేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకుని ఫాంహౌస్ యజమానిపై కేసు నమోదు చేశారు.

అయోడిన్ లోపాన్ని నివారించండి

బళ్లారి సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రోజువారీ ఆహారంలో అయోడైజ్డ్ ఉప్పును ఉపయోగించడం ద్వారా అయోడిన్ లోప రుగ్మతలు రాకుండా చూసుకోవాలని డాక్టర్ మరియంబి సూచించారు. నగరంలోని సరళాదేవి కళాశాలలో శుక్రవారం జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ , జిల్లా సర్వే విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ లోపం నియంత్రణ దినోత్సవ వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అయోడిన్ మానవులకు అవసరమైన సూక్ష్మపోషకం. మానవుని శారీరక, మానసిక వికాసానికి ఇది ఎంతో అవసరమన్నారు. శరీరానికి అవసరమైన హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి థైరాయిడ్ గ్రంథి తప్పనిసరి అన్నారు. ఆకు కూరలు, కూరగాయల్లో అయోడిన్ పుష్కలంగా లభిస్తుందన్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ , ప్రొఫెసర్ చన్నబసయ్య, డాక్టర్ పల్లవి, జిల్లా కలరా నియంత్రణ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీలను మోసం చేసిన ముఖ్యమంత్రి: గాలి

బళ్లారి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో ముఖ్యమంత్రిగా యడియూరప్ప రాష్ట్రంలో ఎస్టీ నిగమ మండలి ఏర్పాటు చేసి ఎస్టీలకు అండగా నిలిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం సిద్దరామయ్య ఎస్టీ నిగమ మండలిలో నిధులను ఎన్నికల్లో గెలుపు కొరకు వాడి ఎస్టీలకు ద్రోహం చేశారని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ధ్వజమెత్తారు. సండూరు అభ్యర్థి బంగారు హనుమంత నామినేషన్ అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందన్నారు. సీఎం సిద్దరామయ్య పదేపదే దమ్ముంటే బళ్లారికి రా జనార్దన్‌రెడ్డి అని సవాల్ విసిరేవారని 14 ఏళ్ల తరువాత బళ్లారికి వచ్చాను, ఇప్పుడు తానే సిద్దరామయ్యకు సవాల్ చేస్తున్నానన్నారు. సత్తా ఉంటే సండూరులో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలన్నారు. ఎస్టీ నాయకుడుగా శ్రీరాములు ప్రజల మనోభావాలు తెలిన వ్యక్తి అని పేదల సేవే దైవ సేవం అని శ్రీరాములు తలిచారన్నారు. తాను మంత్రిగా ఉన్న కాలంలో సండూరు అభివృద్ధికి కృషి చేశానని, ఇప్పుడు తుకారం ఏమి చేశారో చెప్పాలన్నారు. ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి

అక్రమ కట్టడాల కూల్చివేత



పోలీసుల సమక్షంలో కట్టడాలను కూల్చేసిన ప్రాంతం

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధి గాంచిన హంపిలో అక్రమ కట్టడాలపై శుక్రవారం అధికారులు కొరఢా ఝులిపించారు. హంపి విరుపాక్షేశ్వ దేవాలయం ముందు భాగంలో జనతా ప్లాట్ ప్రాంతంలో అక్రమంగా నిర్మించుకున్న షెడ్లు, దుకాణాలు, కట్టడాలను వివిధ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తొలగించారు. హంపి ప్రపంచ పర్యాటక ప్రాంతం నిర్వహణ ప్రాధికార(హవామా) నేతృత్వంలో ఈ జంటి కార్యాచరణ జరిగింది. జనతా ప్లాట్ ప్రాంతంలో హోం స్టేలను హైకోర్టు ఆదేశాల మేరకు ఇప్పటికే కొన్ని దుకాణాలను మూసివేశారు. ప్రాధికార నిర్ణయం మేరకు అక్రమ కట్టడాలను నిర్మించుకున్న వారికి నోటీసులు ఇవ్వాల్సి ఉండగా, అక్టోబరు 24వ తేదీన నోటీసులు ఇవ్వడం పట్ల యజమానులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కన్నడ సాహిత్యానికి శ్రీకంఠయ్య విశేష కృషి

● యాక్టివ్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి



బహుమతులతో విద్యార్థులు

బళ్లారి సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్యానికి కొత్తరూపు దిద్దిన కవి బీఎం శ్రీకంఠయ్య అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి పేర్కొన్నారు. శుక్రవారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో శ్రీకంఠయ్య చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన శ్రీకంఠయ్య సేవలను ప్రశంసించారు. 20వ శతాబ్దంలో కన్నడ భాష ప్రఖ్యాతిపై రవిచెళ్లగుర్కి ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, గురుప్రసాద్, విజయ ముండ్రగి, సుమా, విద్యార్థి ప్రతినిధులు అనూష తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిభావంత విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : మంత్రి

కంప్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోను, రాష్ట్రంలోను కేవలం కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం కుడితిని పట్టణంలో కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ నేతృత్వంలో పల్లెద భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు మాత్రమే పరిమితమయ్యారని, దేశంలో అన్యాయం జరుగుతున్నా స్పందించారన్నారు. ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో రైతులకు, ప్రజలకు, విద్యార్థులకు అన్ని పథకాలు అందించేవారు. రాష్ట్రంలో సిద్దరామయ్య ప్రభుత్వం పథకాల వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఎమ్మెల్యేగా వుంటున్న తుకారామ్ పూర్తిగా నాలుగుసార్లు గెలిచి అభివృద్ధి చేపట్టారు. ఇప్పుడు తాను ఎంపీగా ఎన్నిక కావడంతో ఆ స్థానంలో ఎంపీ భార్య అన్నపూర్ణ ఎమ్మెల్యేగా పోటీ చేస్తోందన్నారు. ఆమెకు భారీ మెజార్టీ ఇచ్చి అత్యధిక ఓట్లతో గెలిపించినట్లయితే సండూరు క్షేత్రం, నియోజకవర్గం పూర్తిగా మాదిరి క్షేత్రంగా మారుతుందన్నారు. అనంతరం సుమారు వందకు పైగా బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. వారికి కందువాకప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తుకారామ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నపూర్ణ, కేఎస్ఎల్ స్వామి, మానయ్య, పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు బసమ్మ, చంద్రప్ప, వి రాజశేఖర్, ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి, వెంకటరమణ బాబు, ఏకాంబరం, తుమటి లక్ష్మణ్ణ, కౌశిక్, బీసన్న, గంగాధర, మోటా తిమ్మప్ప, ఈసప్ప, జనార్దన, పట్టణ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సంతోష్‌లాడ్

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి: ఎంపీ

రాయచూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరిగతిగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి కార్యక్రమాల సమన్వయ సమితి సభలో పాల్గొని ఎంపీ మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన 167వ జాతీయ రహదారికి సంబంధించి కృష్ణనది పై నిర్మిస్తున్న వంతెన పనుల్లో జాప్యం పట్ల ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల జాప్యం గురించి ఇంజనీర్లు వివరించే ప్రయత్నం చేస్తుండగా కథలు చెప్పవద్దంటు ఎంపీ తీవ్ర ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులన్నింటిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తద్వార ప్రజాసౌకర్యం మెరుగుపడాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా అధికారులు తమ పని తీరును మెరుగుపర్చుకోవాలని ఎంపీ సూచించారు. వివిధ శాఖల అధికారులతో ఎంపీ సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎంపీ జీ కుమార్ నాయక్

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి ఆదేశాల మేరకు శుక్రవారం కూడేరు మండ లంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టా రు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునంద, సిబ్బంది కూడేరు మండలంలోని రామచం ద్రాపురం క్రాస్ వద్ద 29 కర్ణాటక మద్యం బాటిళ్లను పట్టుకొని, ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

పాత కేసులో నలుగురికి రిమాండ్

అనంతపురం క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల క్రితం నమోదైన కేసులో నాన్‌బెయిలబుల్ వారెంట్ కింద నలుగురిని రిమాండ్‌కు పంపినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. 2018 లో జరిగిన ఓ క్రిమినల్ కేసుకు సంబం ధిం చి సరిగా కోర్టుకు హాజరు కాని శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన నలుగురిని రిమాం డ్‌కు పంపామన్నారు. ఎవరైనా కోర్టుకు హాజరు కాకపోతే నాన్ బెయిలబుల్ వారెంట్ కింద రిమాండ్‌కు పంపుతామని సీఐ హెచ్చరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

లింగనిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు : డీసీ

బళ్లారి సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీ, పురుషులకు సమానమైన హక్కులున్నాయని, లింగనిర్ధారణ చేసి ఆడ శిశువులను చంపడం నేరమని డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని నూతన జిల్లాపాలనా భవనంలోని వీడియో హాల్లో వీసీ, పీఎన్‌డీటీ చట్టం 1994 కేపీఎంఈ పై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ పనితీరుపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ చట్టం ప్రకారం అనుమతి పొందిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లలో ప్రతి కేసు సమాచారాన్ని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. భ్రూణహత్యలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్య పరిస్థితిపై రిపోర్టు చేస్తూ నిజానిజాలను మాత్రమే నిర్ధారించాలన్నారు. ఈసందర్భంగా జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్‌శరణప్ప, జిల్లాఆరోగ్య కటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లాకుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ పూర్ణిమకట్టిమణి, డాక్టర్ వీరేంద్రకుమార్, డా.అబ్దుల్లా, డా.శంభు, డా.స్రవంతి, ఈశ్వర్ దాసప్పనవర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కకాటును నిర్లక్ష్యం చేయవద్దు

● అవగాహన సదస్సులో వైద్యుల సూచన

బళ్లారిసిటీ, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి):కుక్కకాటుకును నిర్లక్ష్యం చేయరాదని వెంటనే రేబీస్ టీకాలు వేయించాలని నోడల్‌అధికారి డాక్టర్ మరియంబి సూచించారు. శుక్రవారం గుగ్గరహట్టిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రేబీస్ అవగాహన సదస్సును ప్రారంభించి ఆయన మాట్లాడారు. కుక్కకాటుతో ప్రాణంతకమైన రేబీస్ వ్యాధిని అరికట్టవచ్చని తొలిరోజు , 3వరోజు, రేబీస్ టీకాలు తప్పనిసరిగా వేయించా లన్నారు. 14వ రోజు, 28వ రోజు వైద్యుడి సలహా మేరకు చికిత్స పొందాలన్నారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. శేగుప్తా, షాహీన్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, డా.శరత్‌కుమార్, శాంతమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పర వెంకోబ

సిరుగుప్ప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మానసిక విషయంపై శ్రద్ధ తప్పనిసరి అని న్యాయవాది సంఘం అధ్యక్షులు వెంకోబ అభిప్రాయపడ్డారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో బీఈ హనుమంతప్ప మెమోరియల్ కళాశాలలో మానసిక, ఆరోగ్య శిబిర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వెంకోబ ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి మనిషి మానసిక విషయంపై నెలకొకసారి వైద్య పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు అబ్దుల్ సాబ్, వెంకటేష్ నాయక్, ప్రిన్సిపాల్ బసవనగౌడ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరి దుర్మరణం

రాయచూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు బలంగా ఢీ కొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఈ హృదయవిదారక సంఘటన శుక్రవారం జిల్లాలోని సింధనూరు తాలూకులోగల సీఎస్ఎఫ్ చర్చ్ వద్ద చోటు చేసుకుంది. ధమతి గ్రామం నుంచి సింధనూరు కళాశాలకు వెళుతున్న విద్యార్థి షేక్షావలి(19)ని జవళగేరా వైపు నుంచి సింధనూరు వైపు పొలం పనుల కోసం వస్తున్న ముద్దయ్య బైకు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో రెండు బైకుల ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా ప్రభుత్వం కళాశాలకు చెందిన విద్యార్థి షేక్షావలి, అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. అనంతరం ఆస్పత్రికి తరలిస్తుండగా ముద్దయ్య(40) అనే వ్యక్తి మృత్యువాత పడ్డారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సింధనూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం కోసం సింధనూరు తాలూకా ఆస్పత్రికి తరలించారు.

హోసూరు జోన్

మాదకద్రవ్యాల దుష్ప్రభావంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ మోహనప్రియ

హోసూరు అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. మహిళలపై లైంగిక దౌర్జన్యాలు, వాటి నియంత్రణ పద్ధతులు, మాదకద్రవ్యాల దుష్ప్రభావం, అవినీతిపై పోరాటం అనే అంశాలపై ప్రత్యేక సమావేశం జరిగింది, తమిళ విభాగం డాక్టర్ సరస్వతి స్వాగతోపన్యాసం చేయగా కళాశాల ప్రిన్సిపాల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకటేశం ప్రధాన ప్రసంగం చేశారు. మహిళలపై లైంగిక నేరాలు, నివారణ పద్ధతులపై ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీస్ ఇన్‌స్పెక్టర్ షర్మిలాబాను ప్రసంగిస్తూ పెరిగిన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేకించి మొబైల్ ఫోన్లను స్వీయ నియంత్రణతో వాడాలన్నారు. నేషనల్ హెల్త్ వర్క్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎల్ మోహనప్రియ, కళాశాల జాతీయ సంక్షేమ ప్రాజెక్టు, డ్రగ్ ప్రివెన్షన్ అవేర్‌నెస్ కమిటీ, లైంగిక నేరాల నిరోధక కమిటీ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి.

పోలీసులకు చిక్కిన ఆభరణాల దొంగ

రాయచూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సింధనూరు తాలూకా తుర్విహాళ్ పట్టణంలో బంగారు ఆభరణాలు దొంగలించిన నిందితుడు శుక్రవారం పోలీసుల చేతికి చిక్కాడు. రెండు రోజుల క్రితం తుర్విహాళ్ పట్టణంలో మహెబూబ్ సాబ్ ఇంట్లో దొంగతనం జరగగా పోలీసులు కేసు నమోదు చేశారు. రూ.1.35 లక్షల విలువగల ఆభరణాలు చోరీకి గురి కాగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు చిక్కిన నిందితుడు దేవదుర్గ తాలూకా జాగీర్ జాడలదిన్నికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. దొంగతనానికి సంబంధించి తుర్విహాళ్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఆభరణాలను, నిందితుడిని న్యాయస్థానానికి అప్పగించారు.

పశుగణనకు సహకరించాలి : కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కృష్ణగిరి పంచాయతీ యూనియన్ పరిధిలో పశుగణన చేపట్టారు. కృష్ణగిరి కలెక్టర్ కె.ఎం.సరయు మాట్లాడుతూ 21వ పశుగణన ప్రారంభమైందని కృష్ణగిరి జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని అన్ని వార్డులలో సర్వే జరుగుతుందన్నారు. 2025 ఫిబ్రవరికి పూర్తి కానుందనన్నారు. జిల్లాలో 177 మంది పశువుల ఎన్యూమరేటర్లు 35 మంది సూపర్‌వైజర్లను నియమించబడ్డారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆవు, గేదె, మేక, గొర్రెలు, కోడి, పెంపుడు కుక్క, గుర్రం, గాడిద, పంది, కుందేలు సహ 16 రకాల పశువులను పరిగణనలోకి తీసుకోబడతారన్నారు. పశుసంవర్ధక శాఖ జోనల్ జాయింట్ డైరెక్టర్ ఇళంగోవన్, జిల్లా సెన్సస్ కో-ఆడినేటర్ డిప్యూటీ డైరెక్టర్ జో ప్రసన్న సహాయ దర్శకులు ఎ. అరుళ్‌రాజ్, జె. మహేంద్రన్, డాక్టర్ జ్యోతిబసు, వెటర్నరీ అసిస్టెంట్లు డాక్టర్ దినేశ్, డాక్టర్ సి.శివశంకరీ, స్వామినాథన్, రాజారాజన్, వెంకట సుబ్రహ్మణియన్, రాజేశ్, పంచాయతీ కౌన్సిల్ ఛైర్మెన్ అమీర్జాన్, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.



పశుగణనలో కలెక్టర్ సరయూ తదితరులు

క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

హోసూరు అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రాథమిక విద్యాశాఖాధికారి మునిరాజ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలు రకాల క్రీడా పోటీలు నిర్వహిచాఅరు. హోసూరు యూనియన్ 11 మైక్రో సెంటర్లలో రెండు రోజుల్లో అన్ని విభాగాల పోటీలను విజయవంతంగా నిర్వహించారు. విద్యలో గుణాత్మకతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్న గెలుపొందారు. హోసూరు మహిళా జూనియర్ హైస్కూల్‌లోని ముత్తురాయన్ జిబి పాఠశాల జరిగిన కళా ఉత్సవాల్లో జిల్లా అధికారులు సతీస్‌కుమార్, రాజీవ్, పయ్యాస్, సీనియర్ సూపరిండెంట్ కుమరవేల్, సెంటర్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. పోటీలకు సెంట్రల్ కో ఆర్డినేటర్, నాగప్రసాద్, వెంకటేశ్ ఏర్పాటు చేశారు.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులతో ఉపాధ్యాయ బృందం

ఘనంగా ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి జన్మదిన వేడుకలు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా

బళ్లారిరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. నారా భరత్‌రెడ్డి బళ్లారి అరాధ్యదేవత కనకదుర్గమ్మ దేవస్థానం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలో మిల్లర్‌పేట, హుస్సేన్ నగర్, శ్రీరాంపుర కాలనీ, ఏపీఎంసీ మార్కెట్ బాబూజీ నగర్ సర్కిల్, విద్యానగర్, ఎంజీ హనుమాన్ నగర్, కాకర్లతోట, చిన్న దుర్గమ్మ దేవస్థానం పటేల్ నగర్ తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఆయా వార్డుల్లో కార్యకర్తలు, నాయకులు నారా భరత్‌రెడ్డి కటౌట్లకు పాలాభిషేకంతో పాటు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంప్లి ఎమ్మెల్యే గణేష్, మేయర్ నందీష్, కార్పొరేటర్లు, మించు శ్రీనివాస్, కవిత వన్నప్ప, బీఆర్ఎల్ శీన, పూజారి గాదెప్ప, మాజీ మేయర్ రాజేశ్వరి, అలివేలు సురేష్, ఛానాల్ శేకర్, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

కంప్లి: సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే అభిమాని హోసకోటి జగదీష్ కంప్లి సముదాయ ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీష్ నారాభరత్ రెడ్డి మున్ముందు మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మూకయ్యస్వామి, అడవి బసవన్న గౌడ, ఇటిగి బసవరాజు, నెల్లూడి కరిబసవనగౌడ, గంగాధర గౌడ, యర్రిస్వామి, శంకరప్ప, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



చివరిరోజు 58 నామినేషన్లు

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలకు నామినేషన్ల ముగింపురోజు శుక్రవారం మొత్తం 48మంది 58 సెట్ల నామినేషన్లు వేశారు. వీరిలో 47మంది పురుషులు కాగా ఒక మహిళ కలిపి 58 సెట్ల నామినేషన్లు వేశారు. చన్నపట్టణ నుంచి 24మంది 28 నామినేషన్లు, శిగ్గావి 20 మంది 28 మంది, సండూరు నుంచి ముగ్గురు ఐదు సెట్ల నామినేషన్ వేశారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసేసరికి 83మంది 96 సెట్ల నామినేషన్లు వేశారు. వీరిలో ముగ్గురు మహిళలు 6 సెట్ల నామినేషన్లు వేశారు. శిగ్గావి నుంచి 26మంది, చన్నపట్టణ నుంచి 50మంది, సండూరు నుంచి ఏడుగురు నామినేషన్ వేశారు.



చన్నపట్టణలో ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న నిఖిల్



శిగ్గావిలో బీజేపీ అభ్యర్థి భరత్ నామినేషన్, చిత్రంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి తదితరులు



సండూరులో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత

అట్టహాసంగా నామినేషన్లు

- సాధారణ ఎన్నికల తరహాలో ర్యాలీలు
- భారీగా తరలివచ్చిన అభిమానులు

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల నామినేషన్లు అట్టహాసంగా ముగిశాయి. భారీ ర్యాలీలతో అభిమానుల సందడి మధ్య అభ్యర్థులు నామినేషన్ వేశారు. చన్నపట్టణ బీజేపీ-జేడీఎస్ అభ్యర్థిగా నిఖిల్ కుమారస్వామి నామినేషన్ దాఖలు చేశారు. తండ్రి, కేంద్రమంత్రి కుమారస్వామి, మాజీ సీఎం సదానందగౌడతోపాటు భార్య రేవతితో కలసి నామినేషన్ సమర్పించారు. బీబీఏ చదివిన నిఖిల్ 113 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పొందుపరిచారు. 78.15 కోట్ల రూపాయల చరాస్తులు, రూ.29.34 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. భార్య రేవతి పేరిట రూ.5.49 కోట్ల చరాస్తి, రూ.43లక్షల విలువైన స్థిరాస్తులు పొందుపరిచారు. కుమారుడు అవ్యాన్‌దేవ్ పేరిట రూ.11లక్షల నగదు ఉంది. అంతకు ముందు చన్నపట్టణలో జరిగిన ర్యాలీకి వేలాదిమంది హాజరయ్యారు. ప్రతిపక్షనేత అశోక్, మాజీ మంత్రి అశ్వత్థనారాయణ, మైసూరు ఎంపీ యదువీర్, శివమొగ్గ ఎంపీ రాఘవేంద్ర, చిక్కబళ్ళాపుర ఎంపీ డాక్టర్ సుధాకర్‌లు పాల్గొన్నారు. మీ బిడ్డగా భావించి ఆశీస్సులు అందించాలని కుమారస్వామి కోరారు. ఇక శిగ్గావిలో బీజేపీ అభ్యర్థి భరత్ నామినేషన్ దాఖలు చేశారు. తండ్రి బసవరాజ్ బొమ్మై, మాజీ సీఎం యడియూరప్పలతో కలసి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, ఎంపీ గోవింద కారజోళ, మాజీ మంత్రి మురుగేశ్‌నిరాణి, భైరతి బసవరాజ్, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామితోపాటు పలువురు పాల్గొన్నారు. శిగ్గావి, సండూరు నియోజకవర్గాలలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొనగా చన్నపట్టణలో కాంగ్రెస్, జేడీఎస్ అభ్యర్థి మధ్య పోటీ జరగనుంది.



శిగ్గావిలో ర్యాలీగా వస్తున్న మాజీ సీఎం యడియూరప్ప, బసవరాజ్ బొమ్మై తదితర బీజేపీ నాయకులు

సందడిగా సండూరు..

బళ్లారి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత నామినేషన్ సందర్భంగా సండూరు సందడిగా మారింది. శుక్రవారం ఆయన సండూరులో నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా సండూరులోని ఏపీఎంసీ మార్కెట్ యార్డు నుంచి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీఎస్ విజయేంద్ర, మాజీ మంత్రి గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎంపీ పక్కీరప్ప, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రరెడ్డి లతో కలిసి అభ్యర్థి హనుమంత ర్యాలీగా వచ్చారు. ర్యాలీ ఏపీ ఎంపీఎంసీ మార్కెట్ యార్డు నుండి తహసీల్దార్ కార్యాలయం వరకూ సాగింది. కేఎస్ఆర్టీసీ బస్టాండు వద్ద ర్యాలీ ఆపి బీజేపీ నాయకులు ప్రసంగించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీఎస్ విజయేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దరామయ్య నేతృత్వంలో ఎస్టీ నిగమ మండలి నుంచి రూ. 189 కోట్లు డబ్బులు అక్రమంగా డ్రా చేసి ఎస్టీలకు అన్యాయం చేశారని ఆరోపించారు. అలాంటి వారికి ప్రజలు ఓట్లు వేయరాదని కోరారు. గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సండూరులో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థి బంగారు హనుమంతు మాట్లాడుతూ బీజేపీ ని గెలుపుతోనే సండూరు అభివృద్ధి సాధ్యమన్నారు. మాజీ మంత్రి అనిల్ లాడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ వాళ్లను గెలిపిస్తే సండూరు అభివృద్ధి జరగలేదని ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలన్నారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, దివాకర్, ఇతర నాయకులు ప్రసంగించారు. పెద్ద ఎత్తున జనం నామినేషన్‌కు తరలివచ్చారు.



ర్యాలీగా తరలివస్తున్న బీజేపీ నాయకులు

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్

- ముడా అవినీతిలో నిండా మునిగిన సీఎం
- మూడు స్థానాల్లోనూ బీజేపీదే విజయం
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

బళ్లారి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించింది, ముడా వ్యవహారంలో సీఎం సిద్దరామయ్య తప్పు చేశానని స్వయంగా ఒప్పుకున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర విమర్శించారు. శుక్రవారం సండూరు అభ్యర్థి బంగారు హనుమంత నామినేషన్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్టీ నిగమ మండలిలో రూ. 189 కోట్లు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం వాడారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న మూడు స్థానాల ఉప ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు విశ్వాసం కోల్పోయారని, గ్యారెంటీ పథకాలు ఎక్కడా సరిగా అమలు కావడం లేదన్నారు. సిద్దరామయ్య ముఖ్యమంత్రి పదవి కాపాడుకునేందుకు సరిపోయింది కానీ ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సమావేశంలో గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీ పక్కీరప్ప, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మంత్రి జమీర్ కారుపై రాళ్లదాడి

బెంగళూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శిగ్గావి శాసనసభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల నామినేషన్ల విషయంలో గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి యాసిన్ అహ్మద్‌ఖాన్ పఠాన్ నామినేషన్‌లో పాల్గొనేందుకు గృహ నిర్మాణ, వక్ఫ్‌శాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ శుక్రవారం వచ్చారు. టిక్కెట్‌ను ఆశిస్తూ భంగపడిన అజ్జంపీరా ఖాద్రి అనుచరులు మంత్రికారుపై రాళ్లతో దాడి చేశారు. అద్దాలు పగిలిపోయాయి. అంతలోనే పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను కట్టడి చేశారు. అనూహ్యంగా ఎవరికంటా పడకుండా అజ్జంపీరా ద్విచక్రవాహనంపై వచ్చారు. నేరుగా ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే మంజునాథ కుణ్ణూరు కూడా నామినేషన్ వేశారు. టిక్కెట్ దక్కకపోవడంతో వీరు రెబెల్స్‌గా మారారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థికి గుబులు పట్టుకుంది.



ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్‌ను ఆహ్వానిస్తున్న గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్

ఉపరాష్ట్రపతికి సాదర స్వాగతం

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యటన నిమిత్తం వచ్చిన ఉపరాష్ట్రపతి జనదీప్ ధనకర్‌ను రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ సాదరంగా స్వాగతించారు. శుక్రవారం ప్రత్యేక విమానంలో హెచ్ఏఎల్ విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి పుష్పగుచ్చాలు అందించి స్వాగతించారు. రాష్ట్ర మంత్రి చలువరాయ స్వామి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాలినీ రజనీష్, డీజీపీ అలోక్‌మోహన్, నగర పోలీసు కమిషనర్ దయానంద్ సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. హెచ్ఏఎల్ విమానాశ్రయం నుంచి ఉపరాష్ట్రపతి జనదీప్‌ధనకర్ నేరుగా మండ్య జిల్లా నాగమంగల బీజీనగర్‌లోని ఆదిచుంచనగిరి యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరారు.



గంగాభవానికి తమలపాకులతో అలంకరణ

చింతామణి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర, కోలారు జిల్లా ఇంటిదేవతగా వెలసిన గంగాభవాని అమ్మవారిని శుక్రవారం తమలపాకులు, పుష్పాలతో విశేష అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతామణి పట్టణంలోని నారసింహపేటలో కొలువైన అమ్మవారికి నాగార్జున కేవీఎస్ ఈవెంట్స్‌కు చెందిన నాగార్జున్‌తోపాటు మనీశ్ తదితరులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాష్ట్రంలో 623 మంది నకిలీ వైద్యులు

- కోలారు, విజయపుర, తుమకూరులోనే అధికం
- కఠిన చర్యలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

బెంగళూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ వైద్యుల బెడద తీవ్రంగా మారింది. దేశంలోనే అత్యధికంగా మెడికల్ కళాశాలలు కల్గిన రాష్ట్రాల్లో ఒకటిగా రాష్ట్రానికి పేరుంది. ప్రతి జిల్లాలోనూ ప్రైవేట్ లేదా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు సేవలందిస్తున్నాయి. బెంగళూరు, మైసూరు, దావణగెరె, బెళగావి, బాగల్కోట, దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలన్నాయి. దశాబ్దాల క్రిందట ఏర్పాటైన మెడికల్ కళాశాలల ద్వారా వేలాదిమంది వైద్యులు రాష్ట్రంలోనే కాకుండా దేశ విదేశాల్లోనూ ఉన్నత హోదాల్లో ఉన్నారు. అటువంటి రాష్ట్రంలోనూ నకిలీ వైద్యుల బెడద వెంటాడుతోంది. వైద్య ఆరోగ్యశాఖ ఈ ఏడాది 623మంది నకిలీ వైద్యులను గుర్తించింది. కోలారు, విజయపుర, తుమకూరు ప్రాంతాల్లోనే బోగస్ డాక్టర్లు ఎక్కువగా ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ నిర్ధారించింది. రాష్ట్రంలో తరచూ సంచలనం కలిగించేలా భ్రూణహత్యలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా దాడులు చేసింది. మండ్యతోపాటు పలు ప్రాంతాల్లో ఆసుపత్రి, ల్యాబ్ ఆనవాళ్లు లేనటువంటిచోట్ల కేంద్రాలను ఏర్పాటు చేసుకుని భ్రూణహత్యలు జరుపుతున్నట్లు నిర్ధారణకు వచ్చారు. వీరికి కొన్ని ల్యాబ్‌లు సహకరిస్తున్నట్లు గుర్తించారు. 2వేలకుపైగా నకిలీ క్లినిక్‌లు, ల్యాబ్‌లకు తాళాలు వేసిన విషయం తెలిసిందే.



ఏది నకిలీ..? ఏది అసలు..?

అలోపతి వైద్యవృత్తి చేసేవారికి కర్ణాటక మెడికల్ కౌన్సిల్ (కేఎంసి) లేదా కర్ణాటక ప్రైవేట్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ (కేపీఎంఈఏ) నిబంధనల కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆయుష్ వైద్యులైతే ఆయుష్ బోర్డు లేదా కర్ణాటక ఆయుర్వేద యునాని ప్రాక్టీసనర్స్ అసోసియేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందుకు అలోపతి లేదా ఆయుర్వేద విభాగం నుంచి ప్రత్యేకమైన నెంబరు కేటాయిస్తారు. వాటిని క్లినిక్‌లలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇలా రెండు విభాగాలనుంచి రిజిస్ట్రేషన్ చేయించకుండా వైద్యం చేసేవారంతా నకిలీలుగా వైద్య ఆరోగ్యశాఖ పరిగణిచింది. రాష్ట్రంలో వైద్యులుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు 35,132లమంది, పట్టుబడిన నకిలీ వైద్యులు 623మంది, ఇక నోటీసులు జారీ చేసింది 163మందికి కాగా 193 క్లినిక్‌లను సీజ్ చేశారు. 89 మందికి జరిమానా విధించారు. 36మంది కోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో నకిలీల బెడద తీవ్రం కావడంతో వీరి వైద్యవిధానం ద్వారా తరచూ మరణాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమై ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జిల్లాలవారీగా బృందాలను ఏర్పాటు చేసి దాడులు జరిపించింది. దాడుల్లో 623మంది పట్టుబడ్డారు.

కోలారులోనే అత్యధికం

రాష్ట్రంలో నకిలీ వైద్యులు లేని జిల్లాలు లేవు. ఇందులో 2023 నుంచి 2024 సెప్టెంబరు వరకు జరిపిన దాడుల్లో కోలారులో 115మంది నకిలీ వైద్యులను గుర్తించారు. తుమకూరులో 84, విజయనగరలో 81, కలబురగిలో 64మంది పట్టుబడగా మిగిలిన జిల్లాల్లో కొంత మెరుగు అనిపిస్తుంది. దక్షిణకన్నడలో 17మంది, కాగా ప్రతి జిల్లాల్లోనూ పదిమందికి అటుఇటుగా పట్టుబడ్డారు. భ్రూణహత్యలు వెలుగులోకి వచ్చిన తర్వాత నకిలీ వైద్యుల గురించి చర్యలకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమైంది. అంతకంటే ముందుగానే నకిలీల గురించి ఆరా తీసి ఉంటే వందలాదిమంది పసికందుల ప్రాణాలను కాపాడినవారయ్యేవారు. తొలిసారి నకిలీ వైద్యులు పట్టుబడితే రూ.25వేల జరిమానా, రెండోసారి పట్టుబడితే రూ.2.5లక్షలు, ఏడాదిపాటు జైలుశిక్ష, మూడోసారి పట్టుబడితే రూ.5లక్షల జరిమానాతోపాటు మూడేళ్ల జైలుశిక్ష విధించేలాంటి చట్టాలు ఉన్నాయి. పట్టుబడినవారిలో అలోపతికి బదులుగా ఇతర వైద్య విభాగాలకు చెందినవారే ఉన్నారు.



కొందరు వైద్యుల వద్ద కొంత కాలం పనిచేసినవారు, ఆయుర్వేద, యునాని కోర్సులు చేసి అలోపతి వైద్యవిధానం పాటిస్తున్నవారు ఉన్నారు. ఇకపై ఏటా రాష్ట్రవ్యాప్తంగా నకిలీ వైద్యుల దందాను అరికట్టేందుకు జిల్లాల వారీగా కమిటీలు పనిచేసేలా వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమైంది.



హాసనాంబ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏడాదికో సారి తెరుచుకునే హాసన్‌లోని హాసనాంబ ఆలయంలో తొలిరోజు దర్శనాలకు భక్తజనం తరలివచ్చారు. గురువారం మధ్యాహ్నం ఆలయాన్ని సంప్రదాయబద్ధంగా తెరిచినా భక్తులకు దర్శనం శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమైంది. ఉదయం 6 గంటలకే భక్తులు తరలివచ్చారు. ఆన్‌లైన్‌తోపాటు క్యూఆర్ కోడ్‌తో కూడా టిక్కెట్‌లు రిజర్వుచేసుకునే అవకాశం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో హాసనాంబ ఆలయంతో పాటు నగరమంతటా సందడి అనిపించింది. ఆలయం ముందుభాగాన పూలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. సుమారు 10కిలోమీటర్ల బ్యారికేడ్‌లతో క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. హాసన్‌తోపాటు వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు సదుపాయాలు కల్పించారు. ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. నేరుగా దర్శనం కోసం వెయ్యి రూపాయల టిక్కెట్ ఖరారు చేశారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ రూ.300గా నిర్ణయించారు. మైసూరు రాజమాత ప్రమోదాదేవి ఒడెయార్ అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాజణ్ణ ఏర్పాట్లతోపాటు సౌలభ్యాలను పర్యవేక్షించారు.



అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్స్...

ద రా బేంద్రే (వర్ధంతి)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత దత్తాత్రేయ రామచంద్ర బేంద్రె (ద రా బేంద్రె) 1896 జనవరి 31న ధార్వాడలో జన్మించారు. కన్నడలో కథలు, కవిత్వం, విమర్శ, అనువాదం చేసి 'వరకవి'గా పేరొందారు. 'అంబికాతనయ దత్త' కలం పేరిట రచనలు చేశారు. 'నాకు తంతి' రచనకు 1964లో జ్ఞానపీఠ పురస్కారం దక్కింది. ఉడుపి అదమారు మఠం నుంచి 'కర్ణాటక కవి కుల తిలక' గౌరవాన్ని అందుకున్నారు. ఆయన జీవితం, సాహిత్యంపై ప్రముఖ దర్శకుడు గిరీశ్‌కర్నాడ్ ఒక డాక్యుమెంటరీని రూపొందించారు. సాహిత్య అకాడమీ, కేల్కర్ ప్రైజ్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1981 అక్టోబరు 26న కన్నుమూశారు.

హిల్లరీ క్లింటన్ (పుట్టినరోజు)



హిల్లరీ డయానె రోథమ్ క్లింటన్ 1947 అక్టోబరు 26న జన్మించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ సతీమణి. 1993 నుంచి 2001వరకు 'ఫస్ట్ లేడీ ఆఫ్ యూఎస్ఏ'గా కొనసాగారు. న్యూయార్క్ సెనేటర్‌గా 2001 నుంచి 2009 వరకు వ్యవహరించారు. అధ్యక్షుడు బారక్ ఒబామా హయాంలో యూఎస్ సెక్రటరీగా వ్యవహరించారు. పలు పుస్తకాలు రచించారు. యేల్ లా స్కూల్ ఎడిటోరియల్ బోర్డ్‌లోనూ ఉన్నారు. 2023 నుంచి స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో ఫ్యాకల్టీగా కొనసాగుతున్నారు.


అక్రమ భవనాల కూల్చివేతకు కసరత్తు



కమలానగర్‌లో భవనాల కొలతలు వేస్తున్న బీబీఎంపీ అధికారులు



కార్యాచరణలో పాల్గొన్న అధికారుల బృందం



కమలానగర్, నంజప్ప గార్డెన్‌లో రెండు భవనాలు కూల్చివేత

నంజప్పగార్డెన్‌లో పొక్లైనర్‌తో తొలగింపు

బెంగళూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నిరంతరంగా కురుస్తున్న వర్షాలధాటికి బాబుసాపాళ్యలోని ఆరు అంతస్తుల భవనం కూలి 8మంది దుర్మరణం చెందడంపై సీఎం, డీసీఎం తీవ్రంగా పరిగణించిన విషయం తెలిసిందే. నగరంలో శిథిలావస్థకు చేరిన భవనాలను, అక్రమ నిర్మాణాలను గుర్తించాలని మరో ప్రమాదం జరగకకుండా చర్యలు తీసుకోవాలని డీసీఎం డీకే శివకుమార్ ఆదేశించారు. ఈమేరకు నంజప్పగార్డెన్‌లో సర్వే 54/1లో నిర్మించిన భవనాన్ని తొలగించేందుకు సెప్టెంబరు 20న బీబీఎంపీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అక్టోబరు 14న తొలగిస్తామని సంబంధిత యజమాని అధికారులకు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. అయితే కార్యాచరణ జరపకపోవడంతో అధికారులు మరోసారి భవనం తొలగింపు విషయమై చర్చించారు. ఈ మేరకు శుక్రవారం భవనం కూల్చివేత పనులు కొనసాగించారు. గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి ఆరు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. అయితే ఎటువంటి అనుమతులు లేకపోవడం గమనార్హం. మరోవైపు కమలానగర్‌లోని ఓ భవనం కూల్చివేత పనులు ఆరంభమయ్యాయి. రాజకాలువలకు 50 అడుగుల దూరంలో నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని బీబీఎంపీ అధికారులను డీసీఎం ఆదేశించారు. నగరంలో కిలోమీటర్ల కొద్దీ రాజకాలువలకు అనుబంధంగా నివా సాలు ఉన్నాయి. నగరంలో కట్టడాల సమీక్ష సోమవారం నుంచి నిర్వహించదలిచారు.

దొమ్మసంద్ర : ఇటీవల వరుస వర్షాలతో తలెత్తిన సమస్యలకు రాజకాలువలు, చెరువు ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలే కారణమని గుర్తించ డంతో ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, బీబీఎంపీ కమిషనర్ సూచనలతో తాలూకా యంత్రాంగం కార్యాచరణకు సిద్ధమైంది. సర్జాపుర హోబళి యమరె గ్రామ పంచాయతీ పరిధిలోని అక్రమ కట్టడాలను శుక్ర వారం తొలగించే ప్రక్రి య చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునిల్ నేతృత్వంలో గ్రామ పాలనాధికారి శ్రీనివాస్, యమరె పీడీఓ ప్రవీణ్‌కుమార్, సర్వేయర్ మోజిన్‌తోపాటు తాలూకా అధికారి రంగనాథ్‌లు పాల్గొన్నారు. కొన్నేళ్లుగా చెరువు మరవ పారే ప్రదేశం రోడ్డుగా మార్చేశారు. చంబేనహళ్ళి, వి కల్లహళ్ళి చుట్టుపక్కల అపార్ట్‌మెంట్‌లకు ఇదే మార్గంగా ఉంది. ఈ రోడ్డుపై నీరు నిల్వ అయి గుంతలమయమైంది. దీంతో రాకపోకలకు సమస్యగా మారిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి పొక్లైనర్‌తో రాజకాలువ ప్రదేశాన్ని బాగు చేశారు. చంబేనహళ్ళి సర్వే 8లో 2 ఎకరాల 25 కుంటలు స్మశానానికి కేటాయించారు. అయితే సదరు చెరువు మరవ వెళ్లే ప్రదేశాన్ని కొందరు ఆక్రమిం దంతో చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాల్లోకి సహా స్మశానంలోకి చెరువునీరు వచ్చింది. స్మశాన ప్రదేశంలోనే బోరు బావి ఉండగా చంబేన హళ్ళి గ్రామ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం బోరుబావిలోకి భారీగా వర్షపునీరు, చెరువునీరు వచ్చి చేరడంతో బోరునీరు తాగేందుకు యోగ్యంగా లేని పరిస్థితి నెలకొంది. సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులపై యువతి వీరంగం

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో ట్రాఫిక్ పోలీసులపై దౌర్జన్యాలు పెరుగుతున్నాయి. జ్ఞానభారతి పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీబిడ్డ వీరంగం చేసిన సంఘటన మరువక ముందే ఇందిరానగర్‌లో ఓ పోలీస్ అధికారిపై ఓ యువతి తిరగబడ్డారు. ఇఎస్ఐ ఆసుపత్రి జంక్షన్ సమీపంలో ట్రాఫిక్‌వేళ పోలీసులతో యువతి వాగ్వాదం చేస్తున్న వీడియోలు శుక్రవారం వైరల్ అయ్యాయి. ఓ పోలీస్ కానిస్టేబుల్ బాడీ కెమెరాను లాగేసే ప్రయత్నం చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో ఆమెపై చర్యలకు పోలీసులు సిద్ధమయ్యారు.

శివమొగ్గలో కారు బ్యానెట్‌పై కానిస్టేబుల్

వాహనాలు తనిఖీ చేస్తున్న వేళ ఓ కారు ఏకంగా పోలీస్‌పైకి దూసుకొచ్చింది. కానిస్టేబుల్ బ్యానెట్‌పై పడిపోగా కారును నడుపుకొంటూ ముందుకెళ్లిన సంఘటన శివమొగ్గలో గురువారం చోటు చేసుకుంది. భద్రావతి కేబుల్ ఆపరేటర్ మిథున్ దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిగా గుర్తించారు. వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న వేళ భద్రావతివైపు నుంచి వచ్చిన కారును కానిస్టేబుల్ ప్రభు ఆపారు. ఇదే సందర్భంలో డ్రైవర్, పోలీస్ కానిస్టేబుల్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మిథున్ గొడవకు దిగి కారును కానిస్టేబుల్‌పైకి పోనిచ్చే ప్రయత్నం చేశాడు. దీంతో కానిస్టేబుల్ కారు బ్యానెట్‌పై పడ్డాడు. అక్కడనుంచి వంద మీటర్ల దూరం కారును ముందుకు నడిపారు. ఆ తర్వాత కారు స్లో కావడంతో కిందపడ్డాడు. కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈమేరకు జిల్లా ఎస్పీ మిథున్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. కారు అడ్డదిడ్డంగా నడిపిన మిథున్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

టీకా తప్పనిసరి

శిడ్లఘట్ట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పశువులకు సోకే రోగాలలో గాలి కుంటు వ్యాధి ఒకటి. ప్రస్తుత సీజన్‌లో ఈ రోగం సోకుతున్న తరుణంలో జాతీయ పశు రోగ నియంత్రణ కార్యక్రమం అన్ని జిల్లాల్లో అమలవుతోంది. ఈనెల 21న ప్రారంభమైన కార్యక్రమం నవంబరు 20వరకు కొనసాగనుం దని తాలూకా పశుసంవర్ధకశాఖ సహాయక డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. తాలూకాలోని శెట్టిహళ్ళి గ్రామంలో గాలికుంటు వ్యాధి నియం త్రణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పెంచుతున్న పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

తీరిన స్టాంపుల కొరత

అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీలో స్టాంపు పేపర్ల కొరత తీరింది. శుక్రవారం రాష్ట్రానికి కొత్త స్టాంపు పేపర్లు వచ్చాయి. నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లు 20 లక్షలు, 100 రూపాయల స్టాంపు పేపర్లు 10 లక్షలు, 50 రూపాయల స్టాంపు పేపర్లు 10 లక్షలు వచ్చాయి.

ట్రాక్టర్ బోల్తా - రైతు మృతి

ధర్మవరం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన రైతు దామోదర్ (35) ట్రాక్టర్ బోల్తా పడి మరణించాడు. శుక్రవారం దామోదర్ తన మామిడితోటలో కలుపుతీయడానికి ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా.. అదుపు తప్పి ఆ వాహనం బోల్తాపడింది. ట్రాక్టర్ కింద పడి అతను అక్కడికక్కడే మరణించాడు. ధర్మవరం రూరల్ పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. భార్య ఈశ్వరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

డ్యామ్ అభివృద్ధికి కట్టుబడ్డాం : ఎమ్మెల్యే

» చిత్రావతి జలాశయానికి వాయనం

బాగేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి జలాశయంలో పూడికతీత, ఇతర అంశాలలో విషయంలో పొరుగున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో అభివృద్ధికి సాధ్యం కావడం లేదని, అవకాశం లభిస్తే డ్యామ్‌ను అన్ని విధాలా బాగు చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి తెలిపారు. తాలూకాలోని పరగోడు గ్రామంలో నిండిన చిత్రావతి జలాశయానికి శుక్రవారం వాయనం సమర్పించారు. పురసభ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు విశేషపూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని 23 వార్డు ప్రజలకు తాగునీరు అందిస్తున్న చిత్రావతి జలాశయం నిండడం సంతోషంగా ఉందన్నారు. తాలూకా సస్యశ్యామలం కావాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్ మనీషా, పురసభ అధ్యక్షుడు ఏ శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు సుజాత నరసింహనాయుడు, సభ్యులు శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డి, గడ్డం రమేశ్, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నాగమణి సదాశివరెడ్డి, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



వాయనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

ఏఐతో పారిశ్రామిక రంగంలో మార్పు

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విశ్వమంతటా ఏఐ టెక్నాలజీ గణనీయంగా భిన్నమైన రంగాలలో విస్తరిస్తోందని పారిశ్రామికతలోనూ మార్పులు తీసుకురానుందని మెటా వైస్‌ప్రెసిడెంట్ యాన్ లెకున్ అభిప్రాయపడ్డారు. ఓపెన్‌సోర్స్ టెక్నాలజీలో మార్పులకు మూలకేంద్రం కానుందన్నారు. బిల్డ్ విత్ ఏఐ పేరిట శుక్రవారం నగరంలో ప్రత్యేక సదస్సు జరిగింది. 1500మంది నమోదు చేసుకోగా 350 ప్రపోజల్స్ రాగా 90 బృందాలు భాగస్వామ్యం అయ్యాయి. మెటా వైస్‌ప్రెసిడెంట్, ఏఐ నిపుణుడు యాన్ లెకున్ మాట్లాడుతూ ఓపెన్‌సోర్స్ విధానంతో మెటా ఏఐ విజన్ అనుసంధానం చేసుకుందని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో సృజనశీలత, ఆధునికత విభాగాలలో మార్పులు తీసుకురాదలిచిందన్నారు. ఇన్ఫరెన్స్ ఆప్టిమైజేషన్ నుంచి నేచరల్ లాంగ్వేజ్ ప్రాసెస్ వరకు ఓపెన్‌సోర్స్ అనేకవిధమైన అభివృద్ధిని సాధించనుందన్నారు. మెటా ఇండియా వైస్‌ప్రెసిడెంట్ సంధ్యా దేవనాథన్ మాట్లాడుతూ మొబైల్ ఇంటర్నెట్‌లో విప్లవం చేసినట్టే ఏఐలో కూడా సామర్థ్యాన్ని పెంపొందించేశక్తి భారత్‌కు ఉందన్నారు. ప్రభుత్వ సేవలు సరళీకృతంతోపాటు వాట్సప్ బిజినెస్ సొల్యూషన్స్, విద్య, నైపుణ్యత రంగాలపై పలువురు ప్రసంగించారు.

ఆవిష్కరణలపై అధ్యయనానికి రైతులు

బాగేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సాగులో అత్యధిక దిగుబడి సాధించేందుకు కొత్త సాంకేతికతను అలవరచుకోవాలని నూతన ఆవిష్కారాలను సాగులో సద్వినియోగం చేసుకోవాలని హసిరుసేన (నారాయణరెడ్డి వర్గం) తాలూకా అధ్యక్షుడు వెంకటశివారెడ్డి అభిప్రాయపడ్డారు. బెంగళూరు హెబ్బాళ పశువైద్య కళాశాల ఆవరణలో నిపుణులతో చర్చాగోష్ఠి పశుదాణా మేళా కార్యక్రమానికి ఒకరోజు రైతుల అధ్యయన పర్యటనకు శుక్రవారం బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆవిష్కారాలను తెలుసుకునేందుకు ప్రదర్శన దోహదపడుతుందన్నారు. సదస్సులో తాలూకానుంచి 30మంది పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి నరసప్ప, బయ్యారెడ్డి, ఈశ్వరప్ప, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెంగళూరు మేళాకు బయల్దేరిన రైతులు

స్పెల్‌బీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్పెల్‌బి ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో బెంగళూరుకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరచారు. 15 ఏళ్ళకాలంగా ఇంగ్లీషు ప్రతిభను పెంపొందింపే చేసే విధంగా పోటీలను నిర్వహిస్తున్నారు. 2023-24 సంవత్సరానికి గాను జరిపిన పోటీలకు పదివేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కర్ణాటకకు చెందిన ఏడుగురు విద్యార్థులు తొలి టాప్ రెండు స్థానాలలో నిలిచారు. వైదేహి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థి శనయాదాస్ గ్రేడ్-2 విభాగంలో తొలిర్యాంక్‌ను, బెంగ ళూరు దక్షిణ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సంజయ్ రాజేంద్రన్ గ్రేడ్-3 విభాగంలో తొలిర్యాంక్‌ను సాధించారు. స్పెల్‌బి ఇంటర్నేషనల్ ఇప్పటి వరకూ పదిలక్షల మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులకు ఇంగ్లీషు భాషలో నైపుణ్యత కల్పించారు. ఇంగ్లిషులో చదవడం, రాయడంతో పాటు మాట్లాడటంలో విద్యార్థులను రాణించేలా తీర్చేందుకు పోటీలను నిర్వహిస్తున్నారు.



తొలిర్యాంక్ సాధించిన సంజయ్ రాజేంద్రన్

దరఖాస్తుల ఆహ్వానం

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రోత్సహించేందుకు హ్యుండై మోటార్స్ ఇండియా ఫౌండేషన్ నాల్గో సీజన్‌లో ఆర్ట్ ఫర్ హోప్ కొరకు దరఖాస్తులకు ఆహ్వానించింది. హ్యుండై మోటార్స్ కార్పొరేట్ కమ్యూనికేషన్ హెడ్ పునీత్ ఆనంద్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ కళాకారులను ప్రత్యేకంగా గుర్తించదలిచామన్నారు. వారికి ఆర్థికసాయం చేయడం ద్వారా వారి నైపుణ్యాలు ప్రదర్శించేందుకు దేశవ్యాప్తంగా వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబరు 10లోగా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. నాల్గోసీజన్‌లో భాగంగా 50మంది వ్యక్తిగత కళాకారులను వారి ప్రదర్శనలకు అవకాశం ఉంటుందన్నారు. మూడు సీజన్‌లలో వందమంది కళాకారులకు 1.05 కోట్ల రూపాయలు సాయం చేశామన్నారు. ప్రొగ్రెసివ్ ఫర్ హ్యూమానిటీ పేరిట అందిస్తున్నామన్నారు. పెయింటింగ్స్, శిల్పాలు, డిజిటల్ ఆర్ట్, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్, మ్యూజిక్, సంప్రదాయ క్రాఫ్ట్‌లతోపాటు యువత మహిళలు గ్రామీణ సృష్టికర్తలకు అవకాశం ఉంటుందన్నారు.

రాణి చెన్నమ్మ సాహసాలు స్ఫూర్తిదాయకం

శిడ్లఘట్ట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంకోసం పాటుపడి స్వాభిమానంతో పోరాటాల ద్వారా సాహసాలు ప్రదర్శించిన కిత్తూరు రాణిచెన్నమ్మ స్ఫూర్తిదాయకమని డిప్యూటీ తహసీల్దార్ పూర్ణిమా అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో ఏర్పాటైన కిత్తూరు రాణిచెన్నమ్మ జయంతిలో పాల్గొని రాణిచెన్నమ్మ భావచిత్రానికి పుష్పాంజలి ఘటిస్తారు. దేశ ఇతిహాసంలో రాణి చెన్నమ్మ సాహసాలకు ఒక గుర్తింపు ఉందన్నారు. ఆమె పోరాటస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత సామాజిక ప్రముఖులు బసవరాజ్, జిల్లా జాగృతి సమితి సభ్యుడు మంజునాథ, డాక్టర్ వెంకటేశ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కిత్తూరురాణి చెన్నమ్మకు నివాళులు



అలరించిన భరతనాట్యం



భరతనాట్య ప్రదర్శనలో విద్యార్థులు

బెంగళూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని జయనగర్ ఐదో బ్లాక్‌లోగల నంజనగూడు గురు రాఘవేంద్రస్వామి సన్నిధిలో గురువారం ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. మఠం సీనియర్ మేనేజర్ ఆర్‌కే వాదీంద్రా చార్ నేతృత్వంలో బృందావనానికి విశేషపూజల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా డాక్టర్ ప్రియా గణేశ్ దర్శకత్వంలో సముద్వ కళ, సంస్కృత సంస్థ విద్యార్థుల 'భరతనాట్య' కార్యక్రమం ఆకట్టుకుంది.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE :: PUTTUR

O.S.No: 90/2024

Between:-
A.Nagaiah & others ...Plaintiffs
AND:-
T.Subbalakshmi & others ...Defendants

SUMMONS TO DEFENDANT NO.3

M.A.Jebra Sulthana, S/o Allabakash, residing at D.V.G Road, Chikkaballapur, Bhagepalli, Karnataka State.

The plaintiffs filed suit against you and others. The above case posted for your appearance before Hon'ble Principal Civil Judge (Junior Division) Court, Puttur, Tirupathi District on: 18.11.2024 in person or through your advocate at about 10:30 AM and file your objections if any otherwise the matter will be decided Ex-Party.

Date of hearing: 18-11-2024.

B.RAVEENDRA, B.Sc., B.L.,
U.S.RAYUDU, M.Sc., B.L.,
K.BHASKAR, M.A., B.L.,
P.G.VENKATESH, B.Sc.,B.L.,
A.DEEPAK., M.B.A.,L.L.B.,
Advocates/Puttur.

శౌచాలయాల అభివృద్ధికి నిర్ణయం

దొడ్డబళ్ళాపుర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తాలూకా కార్యాలయ ఆవరణలోని శౌచాలయాల అభివృద్ధికి నిర్ణయం తీసుకున్నట్టు రాజేంద్ర తెలిపారు. ఆర్‌ఎల్ జాలప్ప విద్యాసంస్థ ఆధ్వర్యంలో రెవెన్యూశాఖకు సాంకేతిక ఉపకరణాలు అందజేశారు. ఆర్‌ఎల్ జాలప్ప 99వ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సుమారు రూ.4.5లక్షల విలువైన కంప్యూటర్, ప్రింటర్‌లను తహసీల్దార్ విభావిద్యా రాథోడ్‌కు దేవరాజ్ అరసు విద్యాసంస్థ ఉపాధ్యక్షుడు జె రాజేంద్ర అందజేశారు. దూరదృష్టితో ఆర్‌ఎల్ జాలప్ప విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కాగా ప్రజలకోసం ఉద్దేశించి శౌచాలయాలను హైటెక్‌గా తీర్చిదిద్దు అందుబాటులోకి తెస్తామన్నారు. తహసీల్దార్ విభా మాట్లాడుతూ కంప్యూటర్ పరికరాలు సమకూర్చడంపై ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎల్‌జేఐటి ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కార్తిక్, హెచ్‌ఆర్ డైరెక్టర్ బాబురెడ్డి, ప్రొఫెసర్ కేఆర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్ ఇతర పరికరాలను తహసీల్దార్‌కు అప్పగింత

టమోటా కిలో రూ.32

అనంతపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.32తో అ మ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 1275 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.

జీడిపల్లికి 1141 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం 1141 క్యూసెక్కుల కృష్ణాజలాల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,007 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.



విచారణ తుస్సు

- కలెక్టర్ ఆదేశాలతో డీఈఓ విచారణ
- నేటికీ చర్యలు లేకపోవడంపై అసహనం
- మళ్లీ ఫిర్యాదు చేసేందుకు పాఠశాలల చైర్మన్లు సిద్ధం

నాడు- నేడు పనులపై అవినీతి ఆరోపణలు


అక్రమాలపై విచారణ చేస్తున్న అప్పటి డీఈఓ వరలక్ష్మి


కమ్మూరు పాఠశాలలో దెబ్బతిన్న టైల్స్

కూడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాడు- నేడు పనుల్లో అవినీతి జరిగిందన్న ఫిర్యాదులపై జరిగిన విచారణ తుస్సుమందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో నాడు-నేడు పేరుతో పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టారు. మొదట విడతగా 2021-22లో మండలంలో గొట్కూరు, ఇప్పేరు, ముద్దలాపురం, ఉదిరిపికొండ, జల్లిపల్లి, అరవకూరు, కమ్మూరు, క్రొత్తకోట, కూడేరు ఎస్టీ కాలనీ పాఠశాలలతోపాటు కేజీబీవీలో పనులు చేపట్టారు. ఒక్కో పాఠశాలకు రూ.16 లక్షల నుండి రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు టీడీపీ నాయకులు ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలకు అర్జీలు అందించారు. దీంతో కలెక్టర్ వినోద్‌కుమార్ అక్రమాలపై విచారణ చేపట్టాలని డీఈవోను ఆదేశించారు. డీఈవో వరలక్ష్మి ఆగమేఘాలపై జూలై నెలలో విచారణ చేపట్టారు. కూడేరు మండలం కమ్మూరు, కూడేరు ఎస్టీ కాలనీ, కమ్మూరు ప్రాథమిక పాఠశాల్లో జరిగిన పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించడం, రికార్డులు సక్రమంగా లేకపోవడం, ప్రధానోపాధ్యాయులు, చైర్మెన్లు ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై ప్రస్తుత పాఠశాలల చైర్మన్లు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై మరోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్థులతో కలిసి సిద్ధమవుతున్నారు.

టైల్స్ పగిలిపోయాయి



పాఠశాల ఆవరణలో నాడు-నేడు కింద అమర్చిన టైల్స్ అప్పుడే పగిలిపోయాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసిన నాసిరకంగా పనులు చేశారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- దేవేంద్ర (కమ్మూరు ప్రాథమిక పాఠశాల చైర్మన్)

చర్యలు ఏవీ..?



కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో అక్రమాలు జరిగినట్లు గతంలోనే ఆరోపణలు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే అక్రమాలు బయటకు వస్తాయి. కానీ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేయాలి.


- బోయ రాము (జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్)

డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేస్తాం



కూడేరు ఎస్టీ కాలనీ పాఠశాలలో జరిగిన పనుల్లో అక్రమాలు జరిగినా అధికారులు విచారణ చేసి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేస్తాం. ప్రభుత్వం నాడు- నేడు పనులపై విచారణ చేసి అక్రమాలు వెలికి తీయాలని ఆదేశిస్తే, అధికారులు ఎందుకు విచారణ చేయలేదు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

- రాము (ఎస్టీ కాలనీ పాఠశాల చైర్మన్)



ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న కుల్లాయిస్వామి

గుంతకల్లు టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూనివర్శిటీల్లో ప్రొఫెసర్ పోస్టులు చాలావరకు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని అన్నారు. అలాగే డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి పరీక్షతో సంబంధం లేకుండా విశ్వవిద్యాలయాల్లో చదువుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకట్‌నాయక్, కోశాధికారి అఖిల్, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులకు నిర్వహించనున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె స్పష్టం చేశారు. ఇదివరకు ఈ నెల 25వ తేదీన ఉన్న చివరి గడువును ఈ నెల 27 వరకు పొడిగించామన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


సాగైన కందిపంట

కందిపోతోంది

- కంది పంటపై తెగుళ్ల దాడి
- ఆందోళన చెందుతున్న రైతులు


మందు పిచికారి చేస్తున్న రైతు

ఉరవకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కంది పంటపై తెగుళ్ల దాడి ఉధృతమైంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఉరవకొండ డివిజన్ పరిధిలో కంది సాగు గణనీయంగా పెరిగింది. ఉరవకొండలో 5,900హెక్టార్లు, విడపనకల్లులో 18వేల ఎకరాలు, వజ్రకరూరు మండలంలో 25వేల ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట పూత, పిందె దశలో ఉంది. పంటకు ఆకుపచ్చపురుగు, మరకమచ్చ పురుగులు ఆశిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లోని రాగులపాడు, ప్యాపిలీ, తట్రగల్లు, గంజికుంట, ఉరవకొండ ప్రాంతాల్లో తెగుళ్ల బెడద అధికంగా ఉంది. దీంతో రైతులు తెగుళ్ల నివారించేందుకు రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పంట ఆశాజనకంగా ఉంటుదని రైతులు ఆశించారు. అయితే తెగుళ్ల దాడితో పూత, పిందెలు దెబ్బతింటున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పంట ఎదుగుదలకు అవసరమైన మందులతో పాటు తెగుళ్లకు అదనంగా మందులను పిచికారీ చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు అదనంగా రూ. వెయ్యి పెట్టాల్సి వస్తోందని చెబుతున్నారు. ఆకుపచ్చ పురుగుల నివారణకు ఒక లీటర్ నీటికి 2ఎంఎల్ ఫినాల్‌ఫాస్, క్లోరో ఫైరిపాస్ మందులను పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మరక మచ్చ పురుగు ఉన్నట్లయితే ఒక లీటర్ నీటికి, 1ఎంఎల్ నోవా లిరన్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచిస్తున్నారు.


ఆకుపచ్చ పురుగును చూపుతున్న రైతు

తెగుళ్లతో నష్టపోతున్నాం



తెగుళ్ల పంటకు సోకి నష్ట పోతున్నాం. పంట ఎదుగుదలకు అవసరమైన మందులతో పాటు అదనంగా తెగుళ్ల నివారణకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ప్రస్తుతం పంట పూత పిందె దశలో ఉంది. దిగుబడి బాగా వస్తుందన్న సమయంలో తెగుళ్లతో నష్టం కలుగుతోంది.

- రవీంద్ర, రైతు, ఉరవకొండ

వేరుశనగ వదిలి కంది సాగు చేస్తే



వేరుశనగ వల్ల తరచూ నష్టాలే వస్తుండటంతో ఈ ఏడాది కందిపంటను 13ఎకరాల్లో కంది సాగు చేశా. పంట ఆశాజనకంగా ఉన్న సమయంలో తెగుళ్లు సోకడం వల్ల దిగుబడి తగ్గే అవకాశముంది. తెగుళ్ల నివారణ మందుల కోసం రూ.15వేల దాకా ఖర్చు అయ్యింది. తెగుళ్ల రూపంలో నష్ట పోవాల్సి వస్తోంది.

- మల్లికార్జున, రైతు, రాగులపాడు

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

కలెక్టరు వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామని కలెక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, పరిశ్రమలశాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుచేయించి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి అవకాశాలు సృష్టించే తయారీ, సేవారంగ పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటూ సహకారం అందిస్తామన్నారు. ఇండస్ట్రియల్స్ పాలసీలో మంజూరైన యూనిట్లను ఆయాశాఖలు సమన్వయంతో అమలు జరిగేలా చూడాలన్నారు. మంజూరైన యూనిట్లకు సంబంధించిన రూ.32లక్షల సబ్సిడీ సొమ్ము మంజూరుకు కమిటీలో ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ అధికారి శ్రీధర్, ఎల్‌డీఎం నర్సింగరావు, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ కమర్షియల్‌ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ మురళీమోహన్, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా చేపట్టాలి..

అఖిలభారత పశుగణన కార్యక్రమాన్ని పక్కాగా కొనసాగించాలని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పశుగణనపై సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అక్టోబరు 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు పశుగణన కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలోని 31మండలాలలో 493 పల్లెలోని ప్రతి ఇంటికి వెళ్లి పశుగణన చేయాలన్నారు. కార్యక్రమం పూర్తయిన వెంటనే ఆయా ఇళ్ల తలుపు కుడివైపున స్టిక్కర్లు అతికించాలన్నారు. పశుగణనలో పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, వివిధ రకాల కోళ్ల సహా పెంపుడు కుక్కలను జాతులవారీగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, డీడీ రమేష్‌రెడ్డి, ఏడీలు శ్రీలక్ష్మీ, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతమ్ముళ్ల మధ్య 'బెల్ట్' గొడవ

- ఒకరిపై ఒకరు దాడులు..
- కారు అద్దాలు ధ్వంసం


దాడిలో ధ్వంసమైన కారు

యల్లనూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో బెల్ట్‌షాపు విషయంలో తెలుగుతమ్ముళ్లు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గొడ్డుమర్రిలో రెండురోజుల క్రితం గ్రామం నడిబొడ్డున బెల్ట్‌షాపు వెలసింది. ఈ షాపును టీడీపీకి చెందిన యోగానందరెడ్డి వర్గీయులు ఏర్పాటు చేశారు. అయితే అదే పార్టీలోని పుల్లయ్య వర్గీయులు ఆ బెల్ట్‌షాపు ఏర్పాటుపై అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు పుల్లయ్య వర్గీయులు సమాచారం ఇచ్చారనే విషయంపై శుక్రవారం సాయంత్రం ఇరువర్గాల నడుమ స్వల్ప ఘర్షణ జరిగింది.

ఈ ఘర్షణ చిలికి చిలికి గాలివానగా మారి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేవరకు వెళ్లింది. ఈ దాడుల్లో ఒక వర్గానికి చెందిన వారి కారు కూడా ధ్వంసమైంది. ఎస్ఐ రాంప్రసాద్ హుటాహుటిన గ్రామానికి చేరుకుని వారిని చెదరగొట్టారు. అనంతరం పుల్లయ్య, యోగానందరెడ్డిని విచారించారు.

స్కూల్ బస్సు అద్దాలు ధ్వంసం



ధ్వంసమైన బస్సు అద్దాలు

యాడికి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగర్‌సిమెంట్ ఫ్యాక్టరీ వారు స్కూల్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సంఘటన కుందనకోట గ్రామంలో జరిగింది. గుడిపాడు గ్రామానికి చెందిన రాముడు అనే వ్యక్తి సాగర్‌సిమెంట్స్‌లో బస్సు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ బస్సును సిమెంట్ ఫ్యాక్టరీ వారు కుందనకోట నుంచి యాడికిలోని పాఠశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థుల కోసం ఉచిత సర్వీసుకు ఇచ్చారు. కుందనకోటకు చెందిన విద్యార్థులు ప్రతిరోజూ ఆ బస్సులో యాడికిలోని వివిధ పాఠశాలలకు వచ్చి వెళ్తుంటారు. కాగా గురువారం పాఠశాలల సమయం ముగిసిన తర్వాత యాడికి నుంచి బస్సులో విద్యార్థులను కుందనకోటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత బస్సును అక్కడే పార్క్ చేశారు. అయితే రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. బస్సు అద్దాలు పగలడంతో శుక్రవారం విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోయారు. దీనిపై బస్సు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు అద్దాలు పగలగొట్టడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంకెప్పుడు?

నేటికీ విడుదల కాని మార్గదర్శకాలు

సూక్ష్మ సేద్య పరికరాలకు పాత సబ్సిడీనే

కొత్త ధరలపై అన్నదాతల ఆశలు

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలంటున్న వైనం



అనంతపురం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు డ్రిప్ లక్ష్యాన్ని భారీగా ఇచ్చారు. అయితే ఇంత వరకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో రైతులతో పాటు అధికారులు అయోమయంలో పడ్డారు. జిల్లాకు 37500 హెక్టార్లల్లో డ్రిప్ మంజూరు కోసం ఈ ఏడాది ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేశారు. అదే నెలారంభం నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా డ్రిప్ పరికరాల కోసం రైతులు పెద్ద సంఖ్యలోనే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే కొత్త గైడ్ లైన్స్‌ను జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు పాత గైడ్‌లైన్స్ మేరకే రైతులతో నాన్ సబ్సిడీ డబ్బులు కట్టించుకున్నారు. డ్రిప్ అత్యవసరం కావడంతో రైతులు తప్పని పరిస్థితుల్లో పాత సబ్సిడీ అయినా నాన్‌సబ్సిడీ సొమ్మును చెల్లిస్తున్నారు. తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇప్పటి దాకా డ్రిప్ కొత్త సబ్సిడీ ధరలు ఖరారు చేయకపోవడంపై రైతులు నిట్టూరుస్తున్నారు. తమ పాలనలో ఏవిధంగా డ్రిప్ మంజూరు చేశామో అధికారంలోకి వస్తే మళ్లీ అదే పద్ధతిలో ఇస్తామని గత సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.

భారీగా రిజిస్ట్రేషన్లు

ఈ ఏడాది ప్రభుత్వం జిల్లాకు భారీగానే డ్రిప్, స్ప్రింక్లర్ల లక్ష్యాన్ని విధించింది. ఉమ్మడి అనంత జిల్లాకు గతంలో అత్యధికంగా 23వేల హెక్టార్ల లక్ష్యం విధించారు. ఇందులో అనంత జిల్లా 13వేల హెక్టార్లు ఉండింది. ఈ సారి అంతకు రెండింతలు పెంచి 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు లక్ష్యాన్ని విధించారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. కూటమి ప్రభుత్వం హయాంలో తమకు సబ్సిడీని పెంచి, డ్రిప్ పరికరాలు సరఫరా చేస్తారన్న ఆశతో పెద్ద సంఖ్యలోనే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 38027 మంది రైతులు 53923 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.



సూక్ష్మసేద్య పరికరాలకు ఇంకా సబ్సిడీ ధరలు ఖరారు చేయలేదు. గతంలో టీడీపీ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో సూక్ష్మసేద్యం పరికరాలకు పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా డ్రిప్ పరికరాలు సరఫరా చేశారు. గత వైసీపీ పాలనలో సూక్ష్మసేద్య పరికరాల మంజూరుకు సంబంధించి గైడ్ లైన్స్‌ను మార్చారు. ఐదెకరాల దాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని మాత్రమే వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలు సైతం ఇతర కేటగిరీల రైతుల

అప్పటి సబ్సిడీనే ఇప్పుడూ..

తరహాలోనే సబ్సిడీ పోను మిగతా డబ్బులు చెల్లించాలనే షరతు పెట్టారు. దీంతో అప్పట్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీ ఖరారు చేయకపోవడంతో ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైసీపీ సర్కార్‌లోని సబ్సిడీ పద్ధతిలోనే రైతులతో నాన్‌సబ్సిడీ సొమ్ము వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 1798 మంది రైతులతో 2116 హెక్టార్లకు రైతులతో పాత విధానంతోనే నాన్ సబ్సిడీ డబ్బులు కట్టించుకున్నారు. వీరిలో 1028 మంది రైతులకు 1236 హెక్టార్లలో డ్రిప్ పరికరాల మంజూరుకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి దాకా 190 మంది రైతులకు 229 హెక్టార్లల్లో డ్రిప్ పరికరాలు సరఫరా చేశారు.

సబ్సిడీలు పెంచాలి: చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



డ్రిప్ మంజూరులో వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. సబ్సిడీ ధరలు కుదించడంతో రైతులపై అదనపు భారం పడింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీని ఎత్తేశారు. తద్వారా ఆయా వర్గాల రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఎక్కువ శాతం మంది రైతులు డ్రిప్ పరికరాలు అవసరం ఉన్నా.. సబ్సిడీలు తగ్గించడంతో డబ్బులు లేక కొనుగోలు చేయలేకపోయారు. కూటమి అధికారంలోకి వస్తే గత టీడీపీ హయాంలోని సబ్సిడీ ధరలు అమలు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామి మేరకు కొత్త గైడ్ లైన్స్ జారీ చేసి, రైతులకు సబ్సిడీలు పెంచాలి.

హామీని అమలు చేయాలి



గత టీడీపీ హయాంలో మాదిరిగానే డ్రిప్ సబ్సిడీ అమలు చేసి రైతులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలి. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు డ్రిప్ పరికరాలు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా సబ్సిడీ ధరలు మార్చకపోవడం బాధాకరం. టార్గెట్ భారీగా ఇచ్చినా.. సబ్సిడీ ధరలు మార్చకపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదు.

- వెంకట చౌదరి, పండ్లతోటల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

తండ్రి హత్యకేసులో తనయుడి అరెస్టు


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఈరన్న

యాడికి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఈ నెల 23వ తేదీన లక్ష్మీనారాయణను హత్య చేసిన కేసులో కార్తీక్ అనే యువకున్ని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో ఈ అరెస్టు వివరాలను వెల్లడించారు. ఇక్కడి వెంగమనాయుడుకాలనీలో నివాసం ఉండే లక్ష్మీనారాయణకు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య వరలక్ష్మి, కుమారుడు కార్తీక్ ఉన్నారు. రెండో భార్య రమాదేవి ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం లక్ష్మీనారాయణ ఇద్దరి భార్యలకు దూరంగా నివాసం ఉంటున్నాడు. కాగా అతడికి మొదటి భార్య కుమారుడు కార్తీక్‌కు ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న కార్తీక్ ఈనెల 23న స్థానిక కుంటవీధిలో వెనుకవైపు ఉన్న దారిలో వెళుతున్న తన తండ్రిని రాళ్లతో దాడి చేసి దారుణంగా హత్యచేశాడు. మృతుడి రెండో భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ చెప్పారు. శుక్రవారం కార్తీక్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బంది రంగనాయకులు, హరినాథ్, రామాంజులరెడ్డి, శివ పాల్గొన్నారు.

హగరికి జలకళ



బెళుగుప్ప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్లపల్లి సమీపంలో ఉన్న హగరి నదికి జలకళను సంతరించుకుంది. ఎగువ భాగాన ఉన్న భైరవాని తిప్ప ప్రాజెక్టు నుంచి గేట్లు ఎత్తడంతో నదిలో నీరు నిండుగా ప్రవహిస్తోంది. నది చుట్టుపక్కల గ్రామాల రైతులు తోటల్లో పంటల సాగుకు ఎలాంటి ఢోకా ఉండదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారం రోజుల కిందట క్వింటా పత్తి ఎనిమిదిన్నర వేలు ఉండగా ప్రస్తుతం ఆరున్నర వేలకు పడిపోయిందన్నారు. ప్రభుత్వం రూ.7250లు మద్దతు ధర ప్రకటించినా, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారుల మోసాలు పెరుగుతున్నాయన్నారు. పత్తి పంట గిట్టుబాటు కాకపోవడంతో ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం బాగా తగ్గిందన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంమీద ఒత్తిడి తెచ్చి సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

పీఆర్‌లో ముగ్గురికి డెప్యుటేషన్



అనంతపురం సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో పని చేస్తున్న ముగ్గురు ఉద్యోగులను డెప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ ఆశాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర సబ్ డివిజన్ పీఆర్ఐ డీఈఈగా పని చేస్తు న్న మల్లికార్జునను నంద్యాలకు బదిలీ చేశారు. ఈయన స్థానంలో అదే పరిధిలోనే మడకశిర పీఐయూ విభాగంలో జేఈఈగా పనిచేస్తున్న వెంకటేష్‌ను నియమించారు. తాడిపత్రి పీఐయూలో పనిచేస్తున్న జేఈఈ పద్మావతిని అనంతపురం క్యూసీ విభాగానికి బదిలీ చేశారు. దీంతో జేఈఈలు పద్మావతి, వెంకటేష్ శుక్రవారం ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు.

గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి ఈనెల 30వరకు గడువు పొడిగించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ.దేవి శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. ఈమేరకు రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. కోర్సులో చేరడానికి వయసుతో నిమిత్తం లేదన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ కోరారు.